క్లుప్తంగా

దిగజారుడు వ్యాఖ్యలు మానుకో..


గూడపాటి శ్రీనివాస పవన్‌కుమార్

దెందులూరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ఏలూరు జిల్లా చైర్మన్ గూడపాటి శ్రీనివాస్ పవన్ కుమార్ హితవు పలికారు. గురువారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లపై నిరాదరణ ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. రాజకీయ ఉనికిని కోల్పోతామని భయపడుతున్న పవన్‌కళ్యాణ్ తన యజమాని చంద్రబాబు స్క్రిప్ట్‌ను చదివి వినిపిస్తున్నాడన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా 30 వేల మంది ఆడపడుచులు తప్పిపోయిన సంగతి నిజమైతే ఒక్క పోలీస్ స్టేషన్‌లో కూడా ఒక్క కేసు కూడా ఎందుకు నమోదు కాలేదో పవన్‌కళ్యాణ్ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో ఐటీ విభాగం సభ్యులు తదితరులు ఉన్నారు.

వలంటీర్లను విమర్శిస్తే ఊరుకోం


నల్లూరి వెంకట్రామయ్య (బాబి),కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్, సీతంపేట

దెందులూరు: అహర్నిశలు ప్రజల అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలును సకాలంలో ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లను వారి సేవలను అభినందించకపోయినా పర్వాలేదు కాని విమర్శిస్తే ఊరుకునేది లేదని కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య అన్నారు. అన్ని రాష్ట్రాలు ఏపీలోని వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ వైపు చూస్తున్నారు. రాష్ట్రంలో పవన్‌కళ్యాణ్, పచ్చపార్టీకి ఉనికిని కోల్పోతామని వలంటీర్లపై వారి సేవలపై విషం చిమ్మటం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్‌కు, పచ్చపార్టీకి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

భీమడోలులో భారీ వర్షం


భీమడోలులో వర్షం కురుస్తున్న దృశ్యం

భీమడోలు: మండలవ్యాప్తంగా గురువాం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా మూడు గంటల పాటు వర్షం కుండపోతగా కురిసింది. దీనితో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. భీమడోలు, పూళ్ల, గుండుగొలను, సూరప్పగూడెం, పోలసానిపల్లి తదితర గ్రామాల్లో పంట పొలాలకు వెళ్లే రైతులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. అయితే అధిక వర్షాల నేపథ్యంలో రైతులు నాట్లు వేసేందుకు ఉపక్రమిస్తున్నారు.

ఎస్సీల మద్దతు వైఎస్సార్ సీపీకే


విజయసాయిరెడ్డికి అంబేడ్కర్ చిత్రపటం అందిస్తున్న మంగరాజు

గణపవరం: రాష్ట్రంలోని మాల సామాజిక వర్గానికి ఎంతో మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ఆ సామాజిక వర్గం పూర్తి మద్దతు ఇస్తుందని మాలమహానాడు జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గురువారం ఆయన వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల గౌరవాధ్యక్షుడు విజయసాయిరెడ్డిని తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల సామాజిక వర్గమంతా గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి అండగా నిలిచినట్లే రానున్న ఎన్నికలలో కూడా అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేయడానికి తన అంగీకారం తెలుపుతూ విజయసాయిరెడ్డికి ఒక వినతిపత్రాన్నిసమర్పించారు.

నేడు పెదనింద్రకొలనులో గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పెదనింద్రకొలను గ్రామంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి జరిగిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

‘జగనన్న సురక్ష’ పేదలకు వరం

ఎమ్మెల్యే వాసుబాబు


వల్లూరులో కౌలురైతు గుర్తింపు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని, ఈ కార్యక్రమంతో ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు, నాణ్యమైన సేవలు ఉచితంగా అందుతాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం గణపవరం మండలం కోమర్రు, వల్లూరు, వాకపల్లి, వీరేశ్వరపురం గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకం ఏదైనా అర్హులకు రాకుంటే వారందరికీ న్యాయం చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. పైసా ఫీజులేకుండా 11 రకాల ప్రధాన సర్టిఫికెట్లను ఈ కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తారన్నారు. ప్రజల సంక్షేమంకోసం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకుని, తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కౌలు రైతులకు కౌలు రైతు గుర్తింపుకార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అర్థవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపుసోమలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్‌లు కురెళ్ల వెంకటరత్నం, ముత్యాల వేణు, అడబాలరవికుమార్, ఆదిమూలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిడమర్రులో..


దోసపాడు సచివాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

నిడమర్రు: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి అత్యంత చేరువుగా ప్రభుత్వ పథకాలు ఉంటాయని సురక్ష కార్యక్రమం ప్రత్యేక అధికారి వై. రామకృష్ణ అన్నారు. గురువారం అడవికొలను గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ బి. సాయిరాజు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 100పైగా దరఖాస్తు దారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ముందుగా అధికారులు, ప్రజా ప్రతినిధులుగ్రామంలో పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.విజయకుమారి, సర్పంచ్ పాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పాపోలు సుబ్బారావు, నీటి సంఘం అధ్యక్షుడు నిమ్మల బుజ్జి, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీను, నేతలు నిమ్మల రమేష్, పాపోలు సుబ్బారావు, గుండుబోయిన చిన్న, నిమ్మల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

భీమడోలు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. సూరప్పగూడెంలో జగనన్న సురక్షా కార్యక్రమంలో గురువారం సర్పంచ్ వెజ్జు బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ పీడీ పి.విజయరాజు, ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్‌లు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని ఇంటింటికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ లబ్ధిదారుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతుందన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికి కుల, మత, రాజకీయాల కుతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. సాంకేతిక కారణాల రీత్యా ఏవరైనా పథకానికి దూరంగా ఉండగూడదన్న లక్ష్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం 682 మందికి ధ్రువీరణ పత్రాలను అందించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి దేవి, తహసిల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఈవో ఆర్‌డీ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


అడవికొలనులో జగనన్న సురక్షలో మొక్కలు నాటుతున్న అధికారులు, నేతలు

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

దెందులూరు: ప్రజలందరి సౌకర్యార్థం కోసం జగనన్న సురక్ష నిర్వహించడం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్ఎన్‌కృపావరం, ఎంపీడీఓ ఏబీ పీవీలక్ష్మి కోరారు. గురువారం దోసపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అన్ని శాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 150 సర్టిఫికెట్లు అక్కడికక్కడే లబ్ధిదారులకు ఎంపీటీసీ రోహిణి, జిల్లా ప్రధాన కార్యదర్శులు చల్లా మేరీ రాజు, కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మారయ్య, మహేంద్ర అందజేశారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలను స్పెషల్ ఆఫీసర్ కృపావరం, ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీటీసీ పెద్దిశెట్టి రోహిణి నాటారు.

వలంటీర్లకు వందనం

సేవ చేయడమే భాగ్యం



నా పేరు పైడి చంద్రకళ. నేను ఉంగుటూరు గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. వృద్ధులకు సేవల చేసే భాగ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు అందించారు. అంతేకాదు కరోనా లాక్‌డౌన్ సమయంలో నా క్లస్టర్ పరిధిలోని ప్రజల బాగోగులను తెలుసుకుని అధికారులు తెలిపాను. అంతేకాదు ఏదైనా చికిత్స కోసం దూరప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి పింఛన్ కూడా అందించాను.

నిజాయతీగా సేవలు



ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై నిరాధారమైన నిందలు ఎంతో బాధిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వలంటీర్ల చేతుల మీదుగా అమలు చేయడం సంతోషంగా ఉంది. పెన్షన్, ఆన్‌లైన్‌తో పాటు కరోనా సమయంలో కుటుంబ సభ్యులు మాదిరిగా చిత్తశుద్ధితో సేవలందించడం ఎన్నటికీ మరిచిపోలేని విషయం. కరోనా సమయంలో పెన్షన్ నగదు పంపిణీ మరువలేనిది.

– కె.అనూషారాణి, అలుగులగూడెం

బీఈడీ విద్యార్థులకు యూనివర్సిటీ ప్రాక్టికల్ పరీక్షలు


ప్రాక్టికల్ పరీక్షలు పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్ పీ.బాల

దెందులూరు: సోమవరప్పాడులోని సెయింట్‌జాన్స్ బీఈడీ కళాశాల లో గురువారం యూనివర్శిటీ ప్రాక్టికల్ 2021– 23 సంవత్సరానికి సంబంధించి పరీక్షలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్ పీ.బాల, అధ్యాపకులు పరీక్షలు, విద్యార్థుల హాజరు శాతం గురించి పర్యవేక్షించారు. విద్యార్థులు పరీక్షకు నూరుశాతం హాజరయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, ఇతర నాయకులు

పెదవేగి : ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం అంకన్న గూడెంలో గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావులు వీటిని ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన అతిథులకు స్థానిక నాయకులు, పూర్ణకుంభం, పూలమాలలు, బాణాసంచాలతో ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరూ పథకాలను సద్వినియోగ పరుచుకోవాని, సాంకేతిక పరిజ్ఞానం లోపంతో అర్హులైన లబ్ధిదారులకు పథకాలు ఏమన్నా అందకపోతే, దరఖాస్తు చేసుకునేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. రోజుకో గ్రామంలో అర్జీలు సేకరించి తక్షణమే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుని స్థానిక నాయకులతో పాటు మండల స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉండే విధంగా కార్యక్రమం రూపొందించిన ఘనత కూడా సీఎంకే దక్కుతుందన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకి, ప్రస్తుత పాలనకి ఉన్న తేడాను గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమల విజయబాబు, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఆశ, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, అంకన్న గూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్ముడు, ఎంపీటీసీ పిల్లి రామకృష్ణ, కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చల్లగోల్ల భూస్వామి, బి సింగవరం సర్పంచ్ పరసా సరస్వతి సాంబశివరావు, గ్రామనాయకులు మోరవనేని భాస్కరరావు, జానంపేట మాజీ సర్పంచ్ జానంపేట బాబు, కన్వీనర్లు మొరపనేని గోపాలరావు, వల్లే ధనేశ్వరరావు, చిట్టూరి సత్యనారాయణ, పినకడిమి ఎంపీటీసీ గెద్దం సుజాత, పెదవేగి మండల తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు హర్షణీయం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

ఏలూరు(మెట్రో): ప్రజాసేవ కోసం ఎన్నికైన నాయకులు వైద్య, రక్తదాన శిబిరాలు వంటివి ఏర్పాటు చేయడం హర్షణీయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవతో పాటు ప్రజలకు ఆరోగ్యంపై దృష్టిసారించి వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కు ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. శిబిరంలో 21 మంది రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. శిబిరంలో దెందులూరు ఎమ్మెల్యే కోఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, ఏలూరు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ కిలాడి జ్యోతి దుర్గారావు, జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సప్పా మోహన్ మురళి జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, కడిమి రమేష్, ఎం.నీరజ, ఎంపీపీలు ఎస్.వెంకటరెడ్డి, బత్తుల రత్నకుమారి, పెదపాడు ఎంపీడీఓ నిర్మల జ్యోతి, మాజీ కార్పొరేటర్ మాగంటి హేమ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఆషాఢపట్టి సమర్పణ


వాసవీ మాతకు ఆషాఢ పట్టి సమర్పిస్తున్న వాసవీ కిట్టి సభ్యులు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ పట్టిని గురువారం వాసవీ కిట్టి సభ్యులు సమర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో వాసవీ కిట్టిని నూతనంగా ఏర్పాటు చేశామని ఈ నేపథ్యంలో గురువారం అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు, పట్టుచీర, గాజులు, పసుపు కుంకుమలు, పువ్వులతో కూడిన ఆషాఢపట్టిని సమర్పించినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

పాఠశాలల తనిఖీ

లింగపాలెం : పాఠశాలల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనం విషయంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈవో–2 జె రవీంద్ర అన్నారు. గురువారం ఆయన పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు పాఠశాలల రికార్డులు, విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ధర్మాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.

సాయినాథునికి కిరీటం బహూకరణ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఎంబీ సోషల్‌క్లబ్ ఆవరణలో వేంచేసియున్న శ్రీషిర్డీ సాయినాథునికి గురువారం 1 గ్రామ్ గోల్డ్ రాళ్ల కిరీటాన్ని దాత రెడ్డి రంగప్రసాద్ అందజేశారు. ఎంబీ సోషల్ క్లబ్ సీనియర్ సభ్యులు రంగప్రసాద్ స్వామివారి అలంకరణ నిమిత్తం ఈ కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కిరీటాన్ని అలంకరించారు. కార్యక్రమంలో ఎంబీ సోషల్ క్లబ్ ప్రెసిడెంట్ మల్లాది సీతారామారావు, రెడ్డి రంగప్రసాద్, మందిర చైర్మన్ బండారు పద్మారావు, కొణతం అయ్యపరావు, చౌడు ఫకీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో సిబ్బంది


భీమడోలు: నిరుద్యోగ యువతీ యువకుల్లో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఇ.తమ్మాజీరావు అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ హబ్ శిక్షణ కార్యక్రమంలో గురువారంతో ముగిసింది. కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కార్య క్రమంలో భాగంగా యువతీ యువకులు అకౌంట్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కోర్సులో 60మంది విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, హబ్ స్పోక్ రాములతో కలిసి జిల్లా మేనేజర్ ఇ.తమ్మాజీరావు శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తమ్మాజీరావు మాట్లాడుతూ యువతీ యువకులు నైపుణ్యాలను సాధించడం ద్వారా పుష్కలమైన ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. రెండో విడతలో కళాశాలకు స్కిల్ హబ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ మాట్లాడు తూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువత చదువు పూర్తి కాగానే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటారని, ఇలాంటి కార్యక్రమాన్ని కళాశాలలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నిడమర్రు ఎస్సైగా రమవరపు శ్రీను


రమవరపు శ్రీను

నిడమర్రు: నిడమర్రు ఎస్సైగా రమవరపు శ్రీను గురువారం నిడమర్రు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2013 బ్యాచ్‌గా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించి దేవరపల్లి, పోలవరం, వేలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేసి వేలూరుపాడు పీఎస్ నుంచి బదిలీపై నిడమర్రు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను మాట్లాడుతూ మండలంలో మహాలక్ష్మి సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతో గ్రామాల్లో పేకాట, కోడిపందాలు నిర్వహణపై ఉక్కు పాదం మోపుతానన్నారు. బాధ్యతలు స్వీకరించి ఎస్సై శ్రీనుకి హెడ్ కానిస్టేబుల్ జి.వినాయక్, స్టేషన్ సిబ్బంది ధనుంజయ్, బి. సూర్యారావు, దుర్గారావులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.

విచక్షణారహితంగా పురుగుమందులను వాడొద్దు


భీమడోలు పొలంబడిలో రైతులకు బ్యాలెట్ బాక్స్ పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: వరి సాగులో విచక్షణారహితంగా మందులను వాడడం ద్వారా ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతాయని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ శైలజ, సుధారాణిలు అన్నారు. భీమడోలులో గురువారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. అధిక మోతాదులో స్ప్రే చేయడం వల్ల రైతులకు వచ్చే స్వల్ప, దీర్ఘకాలిక రోగాలను ఓ కృత్యాలను చూపించి అవగాహన కల్పించారు. రైతుల విజ్ఞానాన్ని నెమరు వేసేందుకు వారికి బ్యాలెట్ బాక్స్ పరీక్ష నిర్వహించారు. ఏఓ ఎస్‌పీవీ ఉషా రాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం ఏడీఏలు శైలజ, సుధారాణిలు పాల్గొని రైతులు పలు అంశాలపై సూచనలను అందించారు.

పంచాయతీల నిధులు దుర్వినియోగంపై విచారణ చేపడతాం

దెందులూరు: దెందులూరు పంచాయితీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదును విచారణ నిర్వహించకుండా ఫిర్యాదును క్లోజ్ చేయడంపై వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత, దుమారం నెలకొంది. ఈ నేపథ్యంలో పంచాయతీ నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు చేసిన చిలికి శేఖర్ మరోసారి స్పందనలో ఫిర్యాదు చేశారు. మండలాధికారులు ఫిర్యాదులో మొదటి సారి విచారణ చేయకుండా క్లోజ్ చేశారనే నేపథ్యంలో నేరుగా రెండవసారి ఫిర్యాదును డీపీఓ లాగిన్‌కు వెళ్ళింది. ఈ సందర్భంగా జిల్లాకు నూతన డీపీఓగా బాధ్యతలు చేపట్టిన విశ్వనాథ శ్రీనివాస్ ఈ సంఘటనపై మాట్లాడుతూ దెందులూరు పంచాయితీలో నిధుల దుర్వినియోగంపై విచారణ నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

మూడు వేల ధ్రువ పత్రాల పంపిణీ

ఏలూరు రూరల్: ఏలూరు కార్పొరేషన్ అధికారులు మూడు వేల మందికి వివిధ ధ్రువ పత్రాలను అందజేశారు. స్థానిక 15 డివిజన్ ఆది ఆంధ్ర నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తంగెళ్ల రాము మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆళ్లనాని సహకారంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో మేలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, పైసా ఖర్చు పెట్టకుండా ప్రజలు ధ్రువ పత్రాలు అందజేయడం మంచి పరిణామం కొనియాడారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ బాపిరాజు పరివేక్షణలో కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, ఐనపనూరి కేదరీశ్వరితో కలిసి రాము, అధికారులు ప్రజలకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐనపనూరి జగదీష్, జిజ్జువరపు రమేష్, కార్పొరేషన్ పీఓ కృష్ణమూర్తి, ఎంహెచ్‌ఓ మాలతి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

పెదవేగి: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన వేల్పుల నాగరాజు ఈ నెల 5న మందు తాగడానికి తన భార్య విజయను డబ్బులు అడిగాడు. ఆమె నగదు ఇచ్చేందుకు నిరాకరించి ఈ నేపథ్యంలో ఆమెపై అలిగిన నాగరాజు ఇంటి సమీపంలో ఉన్న పురుగుమందును తాగేశాడు. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన నాగరాజును ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు గురువారం ఉదయం చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందినట్లు అందిన ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.